క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

ఆదిలాబాద్‌రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ ఆసీఫ్ ఉల్లా అన్నారు. శుక్రవారం మావల మండలంలోని మావల శివారు ప్రాంతంలో గల ఎస్ఆర్ అకాడమీలో సైబర్ నేరాలు జరిగే విధానంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ అకాడమీ జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ హనుమాన్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండల మాల సంక్షేమ సంఘం నూతన కమిటీని శుక్రవారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సంతపురి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మాదసు అర్జున్, గౌరవ అధ్యక్షుడిగా రాందాస్, ఉపాధ్యక్షుడిగా వేముల దినేష్, సహాయ కార్యదర్శిగా కోడి రమేష్, కోశాధికారిగా వేముల కిరణ్‌లను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బోథ్: నేరడిగొండ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బోథ్ విద్యుత్‌సబ్ స్టేషన్ పరిధిలో అంతరాయం కలుగుతుందని బోథ్ ఏఈ వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30ల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

విరిగిన చెట్టు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: ఇంత నిర్లక్ష్యమా? అనే శీర్షికన సాక్షిలో ఈనెల 11న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో భారీ వృక్షం విరిగి పడింది. పది రోజులైనా సంబంధిత అధికారులు చెట్టును తొలగించలేదు. శుక్రవారం ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో విరిగిపడిపోయిన చెట్టు తొలగించారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. శుక్రవారం కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్ బ్యాంక్ ఆధ్వర్యంలో క్యాంప్ డ్రైవ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రైవేట్ సెక్టార్లలో వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లెక్చరర్లు జగ్‌రాం, సంతోష్, శ్రావణి, ఇమ్రాన్, మంజుల, శ్రీధర దేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి

బేల: మహిళ చట్టాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు బేటీ బచావో బేటీ పడావో, మహిళా చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. లింగ సమానత్వం, లింగ వివక్షత, గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి గేడం నవీన, కళాశాల సిబ్బంది సదాలక్ష్మి, శ్రీను, కల్యాణి, శోభారాణి, స్మిత, సౌమ్య పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



బోథ్: పూజలు చేస్తున్న సీఐ రమేశ్



వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండల కేంద్రంతో పాటు కొర్టికల్, లింగట్ల, మాట్‌లొద్ది గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని ఆయా గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి వినాయక శోభాయాత్ర చేపట్టారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సుభాష్‌నగర్, విద్యానగర్, నవయువ కాలనీలలో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఏనుగు కృష్ణారెడ్డి, లోక శిరీష్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో శుక్రవారం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతర్గాం గ్రామ వినాయకుడి వద్ద ఉంచిన లడ్డు వేలం పాట వేయగా గ్రామానికి చెందిన యువకుడు బక్కి కపిల్ రూ.16,200 దక్కించుకున్నాడు. మండల కేంద్రంలోని కేజీబీవీలో సైతం ఏర్పాటు చేసిన గణపతిని విద్యార్థినులు సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

అడిషనల్ కలెక్టర్ పూజలు..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో తెలంగాణ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. స్థానిక రెవెన్యూ గెస్ట్ హౌస్ ప్రాంగణంలోని వినాయకుడి మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో కొలువుదీరిన గణనాథులకు బోథ్ సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. యువకులు భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించాలని, నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం గణనాథులను నిమజ్జనం చేశారు. ప్రత్యేక పూజలతో పాటు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శోభాయాత్రలో యువకులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, కొట్నాక్ భారిక్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్ పాల్గొన్నారు.



తాంసి: లడ్డూను దక్కించుకున్న కపిల్



కైలాస్‌నగర్: పూజలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్



ఇంద్రవెల్లి: నృత్యం చేస్తున్న యువకులు

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ఇచ్చోడ: జిల్లాస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఇచ్చోడ గిరిజన గురుకుల బాలికల కళాశాలకు చెందిన విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు. అండర్- 18 బాలికల విభాగంలో వంద మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో వైష్ణవి బంగారు పతకాన్ని సాధించారు. అండర్- 18 బాలికల విభాగం 1000 మీటర్ల పరుగు పందెంలో అంకిత బంగారు పథకం సాధించగా, అర్చన వెండి పథకం సాధించారు. అండర్ -14 బాలికల విభాగంలో సోముదేవిక రజత పథకం సాధించారు. విద్యార్థినులను శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ రోజరాణి అభినందించారు.

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సౌత్ జోన్ జూనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉట్నూర్ గిరిజన డిగ్రీ గురుకుల (బాలికల) విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపాల్ హరిత అన్నారు. తమ కళాశాల నుంచి కె. అశ్విని (హైజంప్), 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, ఎస్. రేణుక 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, 400మీటర్ల పరుగు పందంలో రెండో స్థానం, కె. మాధవి 100 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచారని తెలిపారు. అదే విధంగా మహేశ్వరి 400 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం, ఆర్. సంధ్యారాణి హైజంప్‌లో మూడో స్థానం, పి. ప్రియాంక హైజంప్‌లో రెండో స్థానం కైవసం చేసుకున్నారన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నీటి డ్రమ్ములను పరిశీలిస్తున్న అధికారులు

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుమారి, తేజాపూర్, నేరడిగొండ, పట్‌పట్‌తండా, సవర్గాం గ్రామాల్లో డ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాల్లో అధికారుల బృందం పర్యటిస్తూ నిల్వ నీటిని పారబోయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, హెచ్ఈవో పవార్ రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి గంగాధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో తహసీల్దార్ జాడి రాజలింగుతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోశారు. మురికి కాలువలు, నివాసముండే చుట్టూ ప్రాంతాల్లో చెత్త పడేయకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, క్లోరినేషన్ ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు, ఎంపీవో స్వప్నశీల, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ రాజ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జున్ని గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులు పరిశీలించారు. మురుగు నీరు రోడ్లపై పారకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు మురికి కాల్వలను శుభ్రం చేస్తూ... దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ జాగ్రత వహించాలని గ్రామస్తులను కోరారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో సత్యానంద్ పాల్గొన్నారు.

దేశ రాజకీయాలకు తీరని నష్టం



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఎదులాపురం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికే కాకుండా, దేశ రాజకీయాలకు తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం గొప్ప రాజకీయ మేధావిని కోల్పోయిందన్నారు. నాయకులు దర్శనాల మల్లేశ్, బండి దత్తాత్రి, లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, బొజ్జ ఆశన్న, మంజుల, సురేందర్ పాల్గొన్నారు.

తాంసి: సీపీఎం పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందాడు. కాగా.. జిల్లా వ్యాప్తంగా పలువురు కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. పొన్నారి గ్రామానికి చెందిన చిత్ర కళాకారుడు గట్టు రాజు ఏచూరిపై అభిమానంతో ఆయన చిత్రాన్ని గీసి నివాళులర్పించారు.

సంక్షిప్త వార్తలు

ప్రాంతీయ సదస్సుకు జిల్లా నాయకులు

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సుకు ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తరలివెళ్లారు. నాయకులు సుభాష్, శేషారావు, నర్సింగ్, దేవిదాస్, అఖిల్ ఉన్నారు.

మాల సంఘం మండల అధ్యక్షుడిగా రాజు

బోథ్: మండల మాల సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బూర్గుల మల్లేష్, అధ్యక్షుడిగా ఎలుక రాజు, ఉపాధ్యక్షుడిగా సందీప్ కుమార్, కోశాధికారిగా బోడ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా మునేశ్వర్ సోమన్నలను ఎన్నుకున్నారు.

సన్మానం

జైనథ్: ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిషరెడ్డి జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన అల్లూరి అశోక్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. శుక్రవారం మౌనిష్ రెడ్డి జైనథ్‌లోని ఆయన నివాసానికి వెళ్లి శాలువా సత్కరించారు. ఆయన వెంట నాయకులు నారాయణ రెడ్డి, నవీన్‌రెడ్డి, దినేష్ రెడ్డి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి

బోథ్: బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు గొర్ల రాజు, అబూద్‌లు శుక్రవారం బోథ్ గ్రామ పంచాయతీ ఈవో అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధుకర్, గడ్డల నారాయణ, షేక్ మహమ్మద్, అబ్దుల్ రజాక్, రహీమొద్దీన్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇప్పించాలి

ఎదులాపురం: గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న తనకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇప్పించాలని బట్టిసావర్గాం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దర్శనాల సంటెన్న కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న జైనథ్ మండలంలోని దీపాయిగూడకు చెందిన ఆశన్నను మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పరామర్శించారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను శుక్రవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

గుడిహత్నూర్: మండలంలోని గురుజ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ధోనిపల్లి రుక్మాబాయి (110) శుక్రవారం మృతి చెందారు. ఆమె తుదిశ్వాస విడిచే వరకు సైతం ఆమె వ్యక్తిగత పనులు ఆమె స్వయంగా చేసుకునేవారు.

రూ.లక్ష 11 వేలకు లడ్డు వేలం

తాంసి: మండలంలోని పొన్నారి శ్రీ మురళీకృష్ణ ఆలయంలో వినాయక లడ్డు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. స్థానిక యువకుడు తొగరి సురేందర్ రూ. లక్షా 11 వేలకు లడ్డును దక్కించుకున్నారు. దీంతో సుందర సత్సంగ్ సభ్యులు గ్రామస్తులు యువకుడివని అభినందించారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

నేరడిగొండ: పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ నేరడిగొండ, ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు) లఖంపూర్‌లతో పాటు పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జాదవ్ అశోక్ కుమార్, బెజ్జంకి రవీంద్ర, సంతోష్ పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ కార్యవర్గం

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి (టి)రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్ కోఆపరేటివ్ సొసైటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్పుల కిష్టయ్య, ఉపాధ్యక్షుడిగా గేడం దేవిదాస్, కార్యదర్శిగా సంధవార్ భోజన్న ఎన్నుకున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నేరడిగొండ: విద్యాశాఖ సమగ్ర శిక్షాలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, మాట నిలబెట్టుకోవాలని ఉద్యోగులు ఎమ్మెల్యేతో తెలిపారు. తమకు కనీస ఉద్యోగ భద్రత లేదన్నారు. సమగ్ర శిక్షాతో రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు భోజన్న, మమత, సభ్యులు పార్థసారధి, రామ్ అనిల్, వినోద్, రవీందర్, సురేందర్, సుకన్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో లక్ష్మన్ ముసాయిదా ఓటర్ జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పంచాయతీ ఎన్నికల కోసం ఈ ఓటరు జాబితాను కార్యాలయంలో ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. మార్పులు చేర్పులు కోసం వెంటనే సంబధిత బీఎల్‌వోలను సంప్రదించాలని కోరారు. ఎంపీడీవో సూ పరింటెండెంట్ సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరడిగొండ: గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా వివరాలను శుక్రవారం అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. వార్డుల వారీగా జాబితాను ఉంచడంతో తప్పు ఒప్పులుంటే సవరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈనెల 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి 28న తుది జాబితాను ప్రదర్శించనున్నట్లు ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు తెలిపారు.

బజార్‌హత్నూర్: గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాలో ఓటుహక్కు మార్పుకు నేందుకు ఈనెల 14 నుంచి 21 వరకు అవకాశం కల్పించామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని 31 గ్రామపంచాయతీల కార్యాలయాల్లోని ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించామన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బోథ్: మండలంలోని 33 గ్రామ పంచాయతీలో శుక్రవారం రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాను పంచాయతీల్లో ఈవోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులకు ఏమైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఈనెల 21 వరకు తెలియజేయాలన్నారు.

తలమడుగు: ఓటర్ జాబితాను శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ రాజ్‌మోహన్‌లు ప్రదర్శించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామపంచాయతీలో ఓటర్ జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు. ఎంపీవో సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కేదరేశ్వర్‌రెడ్డి, కిరణ్ కుమార్, దేవన్న, అభిరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

బోథ్: అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు ఇంకా దాదాపు 34 వేల ఖాతాల్లో రుణమాఫీ కాలేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోకుండా రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా డబ్బులను రైతులు ఖాతాల్లో వేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ముస్కు రాజేశ్వర్, మలన్న, మోతీరాం, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఇంద్రవెల్లి: గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై దుబ్బక సునీల్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని పర్ధాన్‌గూడ, గొండ్‌గూడ గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గేడం జ్ఞానేశ్వర్, మడావి విశ్వనాథ్, మరప రాజు, మడావి ఇంద్రు పాల్గొన్నారు.

బడికి వెళ్లని పిల్లలను బడిలో చేర్పించిన అనిల్

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఇద్దరు పిల్లలు బడికి వెళ్లకుండా తిరుగుతున్నట్లు కాలనీవాసి జాదవ్ శశి గమనించాడు. ఈ విషయాన్నికిన మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్‌కు సమాచారం అందించగా.. ఆయన వచ్చిన ఇద్దరు పిల్లలను జిల్లా పరిషత్ సెకండరీ బాలుర పాఠశాలలో ఒకరిని 6వ తరగతిలో, మరొక బాలుడిని 7వ తరగతిలో చేర్పించారు. కాగా ఈ విద్యార్థులకు భవిష్యత్‌లో విద్యకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అడ్మిషన్ ఇచ్చిన సహకరించిన ప్రధానోపాధ్యాయులు మహమూద్, ఉపాధ్యాయులు ఆర్‌టివి ప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ మాజీ చైర్మన్



కండువా కప్పి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాదన్ గంగన్న కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం ప్రజాసేవభవన్‌లో జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 25వ వార్డుకు చెందిన పలువురు పంజేషాకాలనీవాసులు సైతం పార్టీలో చేరగా వారికి కండువాలను కప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాదన్ గంగన్న లాంటి సీనియర్ నాయకులు పార్టీలో చేరడం హర్షనీయమన్నారు. ఈనెల 15న హైదరాబాద్‌లో జరిగే పీసీసీ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తలివెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేశ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ బండారి సతీష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న బహెన్‌జీ పద్మ

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం బహెన్‌జీ పద్మ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బ్రహ్మకుమారీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. యుక్త వయస్సు పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, దీంతో ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో లలిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మహ్మద్ అష్రఫ్, అరుణ్, జగ్‌రాం, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



తాంసి పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

తాంసి/ఇంద్రవెల్లి/బోథ్/తలమడుగు: ఆయా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు మద్దతుగా హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమైన పార్టీ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తెలంగాణ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899